

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

14 అక్టోబర్ 2025 పేజీలు : 08



## 'వ్యవసాయ విజేతలు' పేరుతో

# వినూత్న కార్యక్రమం

నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :

**రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులతో వ్యవసాయం ద్వారా ఆదాయార్జన తగ్గిపోతున్న నేపథ్యంలో జిల్లాలో వినూత్నంగా ఛాంపియన్ ఫార్మర్ (వ్యవసాయ విజేతలు) అనే నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.**



సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, సీజనల్ వ్యాధులు, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల భాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడీవోలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి మండలం లోని ఒక గ్రామంలో నెలలో ఒకరోజు సివిల్ రైట్స్ డే నిర్వహించాలన్నారు. జిల్లాలో యానాదులు ఎక్కువగా ఉన్నందున వారికి అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. కేవలం భూ సంబంధ విషయాలే కాకుండా మిగిలిన అన్ని సమస్యలపై చర్చించాలన్నారు. మండల, డివిజనల్ స్థాయిలో పరిష్కారమయ్యే కేసులను జిల్లా కేంద్రం వరకు తీసుకురాకూడదన్నారు. వ్యవ సాయంపై సమీక్షిస్తూ జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి ఒక్క కౌలు రైతుకు సిసిఆర్సి కార్డులు అందజేయాలన్నారు. వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వ్యవసాయాన్ని రైతుకు లాభసాటిగా తయారు చేసేందుకు జిల్లాలో నూతన విధానాన్ని అవలంబిస్తున్నామన్నారు. ఇందుకుగాను జిల్లాలోని 722 గ్రామ పంచాయతీల నుండి ఔత్సాహిక రైతులను ఎంపిక చేసి వారిని

-మిగతా 2లో

## టిడ్కో ఇళ్ళ కోసం అర్హులందరూ

# దరఖాస్తు చేసుకోండి

### కమిషనర్ వై.ఓ నందన్

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహాలను అర్హులైన వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గృహాలు అవసరమైన వారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టిడ్కో గృహాల అంశంపై కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో 17,520 గృహ నిర్మాణాలను పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. టిడ్కో గృహాలలో 300 చదరపు అడుగుల వైశాల్యం గల 16,144 గృహాలను అర్హులైన వారికి ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. 365 చదరపు అడుగుల వైశాల్యం గల విభాగంలో 352 గృహాలు, 430 చదరపు అడుగుల వైశాల్యంతో 1024 గృహాలను నిర్మించామని తెలిపారు. ఉచితంగా అందించే టిడ్కో గృహాలలో 13,559 గృహాలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకుని వాటిలో 11 వేల గృహాలలో లబ్ధిదారులు నివాసం ఉంటూ వారి స్వాధీనంలో ఉన్నాయని తెలిపారు. ఇల్లు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు గృహాలలో చేరని లబ్ధిదారుల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి అర్హులైన నూతన లబ్ధిదారులకు ఆయా గృహాలను కేటాయిస్తామని కమిషనర్ తెలిపారు.

-మిగతా 2లో

## రోజా..

# నీ నాలుక కోస్తా

- కూటమి ప్రభుత్వం చేసే అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతల విమర్శలు
- ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదంటూ మండిపాటు
- డైవర్షన్ పాలిటిక్స్ చేసేందుకే కల్తీ మద్యం వ్యవహారం
- కల్తీ మద్యం వ్యవహారానికి బాధ్యత వహించాల్సింది గత వైసిపి ప్రభుత్వమే
- మాజీ మంత్రి రోజాపై తీవ్రస్థాయిలో మండిపడ్డ నెల్లూరు నగర టిడిపి మహిళ అధ్యక్షురాలు కప్పిర రేవతి

08 పేజీలో



# పిటీషన్లను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల - ఎస్పీ పిజిఆర్ఎస్‌కు 125 ఫిర్యాదులు

నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :



జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిఆర్‌జిఎస్) కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వెజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 125 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీక రించిన ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని.. ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటిషన్లపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగేలా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి,

-మిగతా 2లో

# సమిష్టి కృషితోనే..

### ఉత్తమ స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డు



**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రోత్సాహం, సూచనలు.. ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ సిబ్బంది, ప్రధానంగా పారిశుద్ధ కార్మికులందరి సమిష్టి సహకారం, కృషితోనే ఆత్మకూరుకు ఉత్తమ స్వచ్ఛ మునిసిపాలిటీ అవార్డు వచ్చిందని కమిషనర్ గంగా ప్రసాద్ పేర్కొన్నారు.**

వివరాలు 7లో

# 46వ డివిజన్లో చాయ్ విత్ 'జన సైనిక్స్'




నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : అవకాశం దొరికితే అరిచే రోజా జబర్దస్త్‌లో అవకాశం లేక రోడ్లపై మళ్ళీ ఎక్కింది. ఈ కల్తీ మద్యం ఆజ్యం పోసింది.. విస్తరించింది వైసీపీ ప్రభుత్వ హయాంలోనే. వాటిని కూకటి వేళ్ళతో పెకలించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందని, సిట్ ఏర్పాటు, ఎక్సైజ్ సురక్ష పేరుతో కొత్త యాప్‌ని క్రియేట్ చేసి నకిలీ మద్యం కుట్ర త్వరలో బయట పడనుందని జనసేన నాయకులు కిషోర్ అన్నారు. స్థానిక 46వ డివిజన్ చిన్న బజార్ పాత కూరగాయల మార్కెట్ సెంటర్లో జై సైనిక్ కార్యక్రమంలో జనసేన నేత కిషోర్ గునుకుల మాట్లాడుతూ.. పారదర్శకమైన పాలన అందించి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని మహోన్నత రాజకీయం చేస్తున్న పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడవడం మన అదృష్టమన్నారు. రాష్ట్ర నాలుగు బార్డర్ల చివరి దాక టిడ్కో హౌసెస్‌ను విజిట్ చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ జిల్లా బాధ్యతల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పార్టీ వ్యవస్థను విస్తరిస్తున్న జిల్లా పర్యవేక్షకులు ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో సాగుతున్న చాయ్ విత్ జన సైనిక్స్ నెల్లూరు సిటీ కార్యక్రమంలో 46వ డివిజన్ నాయకులు గురవయ్య, సిటీ పర్యవేక్షకులు గునుకుల కిషోర్, చంద్రన్న, బెల్లపు సుధా మాధవ్, వెంకటేష్, మునిరెడ్డి, మస్తాన్, మాధవ్, సోను, జానీ, అశోక్, హరి, సురేష్, వెంకటేశ్వరరావు, హర్ష, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'వ్యవసాయ విజేతలు' పేరుతో వినూత్న కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)




వ్యవసాయ విజేతలుగా తీర్చిదిద్దుతామన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ పంట పురోగతిని చూపిస్తూ, ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపేవారుగా, సాగు నీటి నిర్వహణలో నైపుణ్యం సాధించే వారిగా, మంచి ఎరువులు, పురుగు మందుల నిర్వహణ పద్ధతులు పాటించే విధంగాను, సాగులో మెరుగైన వ్యవసాయ యంత్రాలను ఉపయోగించే విధంగా, పోస్ట్ హార్వెస్ట్ టెక్నిక్‌లను ఉపయోగించడం, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ఆచరించడం తదితర నైపుణ్యాలను అందిపుచ్చుకునే విధంగా తయారు చేస్తామన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మరలే విధంగా, అలాగే ఆధునిక సాంకేతికత మేళవించి వ్యవసా యాన్ని లాభసాటిగా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విత్తనాల దశ నుండి పంట అమ్మకం దశ వరకు అన్ని పరిస్థితుల్లో వారికి చేదోడుగా ఉంటామన్నారు. అదేవిధంగా వర్షాలు పడే ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ యం. వెంకటేశ్వర్లు, డీఆర్ఓ విజయ్ కుమార్, జడ్పీ సీఈవో మోహన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# పిటీషన్లను త్వరితగతిన పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)



ఎస్పి-2 సిఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్నిలా..

⦿ ఇందుకూరుపేట పరిధికి చెందినటువంటి వ్యక్తిని, టెలిగ్రామ్‌లో బిట్ కాయిన్ ట్రేడింగ్ కొరకు ఒక వ్యక్తి సంప్రదించి, అధిక సొమ్ము సంపాదించవచ్చని ఆశ చూపించి, ఒక వ్యక్తి ఫోన్ ద్వారా సంభాషించి, ఆరు లక్షలు పెట్టుబడి పెట్టించి, ఎటువంటి నగదు తిరిగి ఇవ్వకుండా, అడిగితే సరిగా స్పందించకుండా ఉండడంతో, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ రాపూరు పరిధికి చెందినటువంటి వ్యక్తిని, పుత్తూరు పరిధిలోని తడుకు గ్రామానికి చెందిన హేమంత్ అనే వ్యక్తి సాఫ్ట్వేర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి రూ.4.50 లక్షల నగదు తీసుకుని సాఫ్ట్వేర్ జాబు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ నెల్లూరు టౌన్ పరిధికి చెందిన మహిళ, తన 25 సంవత్సరాల కుమార్తె ఆగస్టు నెల నుండి కనిపించడం లేదని, దర్గామిట్ట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు, ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

⦿ ఆత్మకూరు పరిధికి చెందిన 73 సంవత్సరాల వృద్ధుడు, తన చిన్న కుమారుడు తన జీవనోపాధి గురించి పట్టించుకోవడంలేదని, తన ఉన్నటువంటి ఇంటి నుండి వెళ్లిపోవాలని బెదిరించి, ఇంటికి తాళం వేసి కారుని ఇంటికి అడ్డంగా పెట్టాడని, ప్రస్తుతం తన ఏ పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్నామని, జీవనోపాధి కష్టంగా ఉందని, అదేవిధంగా చేజర్ల పరిధికి చెందినటువంటి 85 సంవత్సరాల వృద్ధుడు, తనకు పిల్లలు లేకపోతే తన చెల్లెలు కుమారుడు కాకర్ల పెంచలయ్యని పెంచి పెద్ద చేసి పెళ్లి చేసినట్లు, ప్రస్తుతం తన ఉంటున్న ఇల్లు, ఆస్తి కోసం ఇబ్బందులు గురి చేస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ ముత్తుకూరు పరిధికి చెందినటువంటి వ్యక్తి, తాను దివ్యాంగుడునని, 30 సంవత్సరాల నుండి బతుకుదెరువు కోసం ముత్తుకూరు పరిధిలో నివసిస్తున్నట్లు, తనకు ఉన్న 30 అంకణాల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తి ఆక్రమించుకొని, తనని, తన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నట్లు, విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ కందుకూరు పరిధికి చెందిన మహిళను, తన భర్త, అత్తమామలు, ఆడపడుచులు అధిక కట్నం కోసం వేధిస్తున్నారని, తన భర్త మద్యం తాగి వచ్చి కొడుతున్నాడని, తనను ఇంట్లో బంధించి తాళం వేసి వేధిస్తున్నారని అదేవిధంగా సంగం పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త, అత్తమామలు వేధిస్తున్నట్లు, తన బంధువుల వద్ద నుండి డబ్బు, నగలు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వలేదని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విచారించి, కౌన్సిలింగ్ నిర్వహించి తన కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

⦿ దగదర్తి పరిధికి చెందిన మహిళను, తన భర్త కొట్టి గాయపరిచి చిత్రహింసలు గురి చేసినట్లు, దగదర్తి స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు, ప్రస్తుతం తన భర్త, తన మరిదితో కలిసి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు, తన కొడుకుని బలవంతంగా తీసుకుపోవాలని తన అత్త ప్రయత్నిస్తున్నట్లు, కావున విచారించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని తనకు రక్షణ కల్పించాలని కోరారు.

## టిడ్కో ఇళ్ళ కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)


365 చదరపు అడుగుల వైశాల్యం గల గృహాల విభాగంలో 67 గృహాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి లబ్దిదారులకు అందజేశామని, 430 చదరపు అడుగుల వైశాల్యం గల గృహాల విభాగంలో 294 గృహాలను పూర్తిచేసి లబ్దిదారులకు అందించామని తెలిపారు. అయితే 365 చదరపు అడుగుల విభాగంలో కేవలం రెండు కుటుంబాలు, 430 చదరపు అడుగుల విభాగంలో 67 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నారని, గృహాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ, ఆ గృహాలలో నివాసం ఉండని వారి రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసి కొత్త లబ్దిదారులకు వాటిని స్వాధీనం చేస్తామని కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని గృహాలకు సంబంధించిన లబ్దిదారులు నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని హౌసింగ్ సెక్షన్‌ను సంప్రదించి 32ఏ ఫామ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనాలని కమిషనర్ తెలిపారు.

## రోడ్డు దాటుతూ వ్యక్తి మృతి



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : కాకుటూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతూ ఉన్న రొద్ద కొండలరావు అనే వ్యక్తిని గుర్తుతెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. తరువాత పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడానికి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## వైసీపీ నాయకులు పద్మనాభరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణంలో స్థానిక వైకుంఠపురంలో నివాసం ఉంటున్న ప్రముఖ కాంట్రాక్టర్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు వైసీపీ సీనియర్ నాయకులు పి.పద్మనాభరెడ్డి ప్రమాదవశాత్తు మరణించారు. సోమవారం వారి అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పద్మనాభరెడ్డి చనిపోవడం తీవ్రంగా మనసును కలచి వేసిందని, పార్టీకి తీరని లోటని వారు తెలిపారు. వారి కుటుంబానికి వైఎస్ఆర్‌సిపి ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సౌమ్యుడు, మృదుస్వభావం కలిగిన వ్యక్తి నిస్వార్థపరుడు ఎవరైనా సహాయం కొరకు వస్తే నేనున్నాను అంటూ భరోసా కల్పించే వ్యక్తికి ఇలా మనమధ్యలో లేకపోవడం బాధాకరమని తమ ఆవేదనను వ్యక్తపరిచారు. అంత్యక్రియల్లో వైసీపీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గార్డెన్ వరల్డ్ ఆధ్వర్యంలో నర్సరీ డీలర్ల ఆత్మీయ సమావేశం




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని పొట్టే పాలెంలో గార్డెన్ వరల్డ్ ఆధ్వర్యంలో నర్సరీ డీలర్ల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గార్డెన్స్ నీడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.గౌతమ్ మల్హోత్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లు లేకపోతే మానవాళి మనుగడ ఉండదని, ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని ప్రతి ఒక్కరు తమకు గుర్తుండిపోయే రోజుల్లో మొక్కలు నాటాలని ఆకాంక్షించారు. ఆక్సిజన్‌ను విడుదల చేసే బోన్ సై, మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుస్తాయని వీటిని ప్రతి ఒక్కరు నాటాలన్నారు. నర్సరీ యజమానులు ప్రజలకు అందుబాటు ధరల్లో మొక్కలను అందించాలని సూచించారు. ప్రతి నర్సరీ యజమాని సమాజ హితం కోసం కొన్ని మొక్కలను ఉచితంగా అందజేయాలని కోరారు. గార్డెన్ వరల్డ్‌లో మంచి నర్సరీ నర్సరీని స్థాపించిన జెట్టి నవీన్ కుమార్‌రెడ్డిని అభినందించారు. ఆత్మీయ సమ్య సమావేశం సందర్భంగా పలువురు నర్సరీ యజమానులను సన్మానించి మెమెంటోలు అందజేశారు. స్టెప్ అప్ అధినేత నేలకుర్తి రమణ ఆధ్వర్యంలో ఈవెంట్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో గార్డెన్ నీడ్స్ జనరల్ మేనేజర్ పవన్ కుమార్, రవి గార్డెన్స్ బాపట్ల అధినేత జి.రవీంద్ర సంజీవరెడ్డి, ప్రకృతి ప్రేమికుడు మోపూరు భాస్కర్‌నాయుడులు పాల్గొన్నారు.

# గొల్ల కందుకూరు, సజ్జాపురంలో రచ్చబండ కార్యక్రమం

## రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ : ఆనం





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నుండి గ్రామస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నెల్లూరు రూరల్ మండలం గొల్ల కందుకూరు, సజ్జాపురం గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ఉద్యమం సంతకాల సేకరణ కార్యక్రమం నెల్లూరు రూరల్ మండలం నాయకులు, కార్యకర్తలతో కలిసి సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఆనం విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 8వేల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యేటువంటి పరిస్థితుల్లో 3వేల కోట్ల రూపాయలతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను శంకుస్థాపన చేయడం జరిగింది. అందులో 5 మెడికల్ కళాశాలలో పూర్తిస్థాయిలో ప్రారంభించారు. ఒక మెడికల్ కళాశాల అధ్యాపకుల నియమించకపోవడం వలన ప్రారంభం కాలేదు. మిగిలిన 11 మెడికల్ కళాశాలలో వివిధ దశల్లో నిర్మాణం జరుగుతూ ఉన్నాయి. ప్రస్తుతం ఈ కూటమి ప్రభుత్వం ఈ 17 మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం చాలా దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ మండలం, గొల్ల కందుకూరు గ్రామం, సజ్జాపురం గ్రామం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారుల భవితకు అండ.. బాల భవిత కేంద్రం



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** పుట్టుకతో అంగ వైకల్యానికి లోనైన బాలల సంరక్షణ కోసం బాల భవిత కేంద్రం ఎంతో కృషి చేస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాడు నెల్లూరు బాల భవిత కేంద్రం నందు జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ.. బాల భవిత కేంద్రం చిన్నారుల భవితకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు పుట్టుకతోనే లోపాలు వస్తే అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి భరోసా కల్పిస్తుందని ఆరోగ్య విషయంలో సమస్యలు గుర్తించి ఉచిత వైద్యం చేస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఫిజియోథెరపీ చేయిస్తూ శారీరక సమస్యల నుండి విముక్తి కలిగిస్తుందని కాస్త మెరుగుపడ్డాక ఇతరత్రా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయిస్తూ చిన్నారుల ఆరోగ్యానికి అండగా నిలుస్తుందని తెలిపారు. తదుపరి అక్కడ పిల్లలకు వైద్య సదుపాయం ఎలా అందుతుందని సంరక్షకులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఫిజియోథెరపీ రూమ్స్ అన్నిన్యాయమూర్తి తనిఖీ చేశారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని టోల్ ఫ్రీ నెంబర్ 15100తో మాట్లాడవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్ డాక్టర్ ఎంవి సురేష్ బాబు డాక్టర్ పావని మేనేజర్ జమీర్ పారా లీగల్ వాలంటీర్ శ్రీనివాసులు పసల వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ స్వాతి చేసిన అక్రమాలను సరిదిద్దాలి : బీజేపీ నేత మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** తహసిల్దార్ స్వాతి చేసిన అక్రమాలను సరిదిద్దాలని నెల్లూరు ఆర్డీవో అనూషకు బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. స్వాతి పొదలకూరు తహసిల్దార్‌గా విధులు నిర్వహించేటప్పుడు రికార్డులను ట్యాంపరింగ్ చేసింది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు బదలాయించింది. ఒకరి ఆస్తులను ఇంకొకరు బదలాయిస్తూ రికార్డులను ట్యాంపరింగ్ చేయడం జరిగింది. ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేసి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ రికార్డులలో జరిగిన అవకతవకలను సరిదిద్దకుండా వదిలి వేసి ఉన్నారు. ప్రభుత్వం మారిన పాలకులు మారిన గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దే చర్యలు తీసుకోలేదని ఆర్‌డిఓకి రమేష్ విజ్ఞప్తి చేశారు.

# నేడు ప్రజావేదిక బహిరంగ సభ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహింపబడుతుందని ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి తెలిపారు ఉపాధి హామీ పథకం ద్వారా 2024 ఏప్రిల్ 1వ తేదీ నుండి 2025 మార్చి 31వ తేదీ వరకు గ్రామాలలో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించి ఈ ప్రజా వేదికను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పంచాయతీరాజ్ హౌసింగ్ వెలుగు పశు సంవర్ధక అటవీ శాఖ తదితర సమన్వయశాఖల ద్వారా చేపట్టిన పనులపై పబ్లిక్ హియరింగ్ నిర్వహించబడుతుందన్నారు కావున జడ్పిటిసి సభ్యులు ఎంపీటీసీ సభ్యులు గ్రామ సర్పంచులు కార్యదర్శులు, సంబంధిత శాఖ అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

# కర్రతుమ్మ చెట్లు కొట్టుకునేందుకు వేలంపాట



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని ఎర్రబల్లిపాలెం చెరువు పాతూరు చెరువుల్లో ఉన్నా కర్రతోమ్మ చెట్లను కొట్టుకునేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ మహేంద్ర తెలిపారు. వేలంపాటలో పాల్గొనేందుకు ముందుగా పదివేల రూపాయలు ధరావత్తు చెల్లించాలన్నారు. ఆ విధంగా చెల్లించిన వారు పాటలో పాల్గొనవచ్చు అన్నారు. ఈనెల 17వ తేదీన స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# విధుల్లోకి నూతన ఉపాధ్యాయులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఇటీవల డీఎస్సీ ఎంపికైన నూతన ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలానికి 34 మంది ఉపాధ్యాయులు రాగా వారిలో ఇద్దరు ఎస్జీటీ, 32 మంది స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు. ఒక్క ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనే 15 మంది నూతన ఉపాధ్యాయులు చేరారు. ఉపాధ్యాయుల నియామకంతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరినట్లుంది. విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినం దనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై సెమినార్




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక విశ్వదయ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో సోమవారం విద్యార్థులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ పై విద్యార్థిని, విద్యార్థులకు కావలి సెల్ టాక్స్ జాయింట్ కమిషనర్ వరప్రసాదరావు నిర్వహించారు. అనంతరం సూపర్ జీఎస్టీ గురించి విద్యార్థులకు తెలుపుతూ గతంలో వివిధ రకాలుగా జీఎస్టీలు ఉండేవని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర మధ్యతరగతి కుటుంబంలోకి దేశంలో ఉండే ప్రతి ఒక్క మద్య తరగతి కుటుంబాలకు ఈ సూపర్ జీఎస్టీని ఎంతో ఉపయోగమని విద్యార్థులకైతే ఎలక్ట్రానిక్ ఎలక్ట్రానిక్ వస్తువులైన ల్యాప్టాప్, స్టేషనరీకి సంబంధించిన వస్తువులపై జీఎస్టీ కొంతమేరకు తగ్గిపోయి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వారు తెలిపారు. అంతేకాకుండా ప్రతి ఒక్క విద్యార్థి జీఎస్టీ గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలని ఎక్కడికైనా షాప్‌కి కొనుగోలుకు వెళ్లినప్పుడు గతంలో జీఎస్టీ పర్సెంట్ ఉంది ప్రభుత్వం తగ్గించిన తర్వాత జీఎస్టీ ఎంతుంది అనే వేరియేషన్ చేసుకొని అవగాహన చేసుకోవాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ పై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విశ్వదయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సిబ్బంది, కమర్షియల్ టాక్స్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై పలు ప్రాంతాల్లో తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక టెక్కే మిట్ట, రెడ్ క్రాస్, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో సోమవారం పర్యటించారు. వర్షాకాలంలో డ్రైను కాలువలలో మురుగునీరు సాఫీగా ప్రవహించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో వేదాలు వేయకుండా దుకాణదారులందరికీ హెచ్చరించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. వ్యర్థాల సేకరణ వాహనాలు అన్ని ప్రాంతాలలో క్రమం తప్పకుండా తిరిగేలా పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మాజీ మేయర్ భాను శ్రీ, ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 68 అర్జీలు : కమిషనర్



**నెల్లూరు మేజర్‌న్యూస్, కార్పొరేషన్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వైఓ నందన్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు రోడ్లపై చేరకుండా డ్రైన్ కాలువల నిర్మాణం, మరమ్మత్తు పనులను అన్ని డివిజన్లలో చేపడుతున్నామని తెలిపారు. ఖాళీ స్థలాల యజమానులు వారి స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శులు తెలియజేసి, స్థానికులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైను కాలువలను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దని, అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో తొలగించి వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న విజ్ఞప్తులను నిర్దేశించిన సమయంలోపు శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 4, ఆప్మాస్ 6, ఇంజనీరింగ్ 15, హౌసింగ్ సెక్షన్ 24, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 4, టౌన్ ప్లానింగ్ 7, పెన్షన్ 4, మొత్తం 68 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నానో యూరియా లిక్విడ్ పై అవగాహన



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సొసైటీ ద్వారా నానో యూరియా లిక్విడ్ పై రైతులకు అవగాహన కల్పించినట్లు సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు ప్రస్తుతం రైతులకు యూరియా కొరత ఉన్నందున దాని ప్రత్యామ్నాయంగా నానో యూరియా లిక్విడ్ ఎకరాకు అర లీటర్ వంతున వాడుకున్నట్లయితే పైరు ఏపుగా పెరుగుతుందని యూరియాతో సమానంగా ఉంటుందని తెలిపారు కావున రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా ఈ లిక్విడ్ ను వాడుకోవాలని తెలిపారు. ఒక్కో బాటిల్ ధర సుమారు 200రూపాయలు ఉందని దీని ద్వారా కొరతను సులభంగా అధిగమించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాములపాటి మాల్యాద్రి సొసైటీ సిబ్బంది శ్రీనివాసరెడ్డి మణిరత్నం తదితరులు ఉన్నారు.

# చికెన్ దుకాణాల తొలగింపు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు బంగ్లా సెంటర్ నందు శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయం సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో ఏర్పాటు చేసియున్న చికెన్ దుకాణాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఏఈ మహేంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్‌లు ఆ ప్రాంతానికి విచ్చేసి దుకాణాలు నిర్వహించుకుంటున్న వారితో మాట్లాడి ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారందరికీ ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాలు చూపించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో దుకాణాలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది తప్ప ఎవరికి అన్యాయం చేయాలని ఆలోచన లేదన్నారు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇక్కడ దుకాణాలు కోల్పోయిన వారికి మరోచోట ప్రభుత్వ స్థలం చూసి వారు దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. దాంతో దుకాణాదారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు తొలగించుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో దుకాణ యజమానులు తదితరులు ఉన్నారు.

## రూ.1.59 లక్షల విత్తనాల అమ్మకాల నిలిపివేత



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాలను సోమవారం కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులు, పురుగుమందుల క్రయ, విక్రయాల రికార్డులు, ఇన్వాయిస్ బిల్లులు, గోదాముల్లో నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణ గోదాము జీఎస్టీ లైసెన్సు లేనందున రూ. 1,59,500 విలువ కలిగిన విత్తనాల అమ్మకాలను నిల పుదల చేశారు. అన్ని దుకాణాల యజమానులు బిల్లు పుస్తక నిర్వహణ సరిగా లేదని, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులు నకిలీవి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ పీ.చెన్నారెడ్డి, వ్యవ సాయాధికారి విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఈవోకు ఘన సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ స్వచ్ఛతాహి భారత్ కార్యక్రమంలో ప్రకటించిన స్వచ్ఛ పంచాయతీలో వింజమూరు పంచాయతీ ఎంపికైన విషయం తెలిసిందే. కాగా ఆ సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఉపాధ్యాయ సంఘ సభ్యులు ఈఓ కె.రామారావును శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వింజమూరు పంచాయతీ అభివృద్ధి పరంగా స్వచ్ఛత పరంగా ముందంజలో ఉందని భవిష్యత్తులో కూడా ఇదే పంథాలను అనుసరించవలసిందిగా వారు కోరారు. భవిష్యత్తులో మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ నాయకులు ఆందోళన






## ఆనం ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కి వినతి


**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నెల్లూరు రూరల్ నియోజవర్గ సమన్వయ కర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజక వర్గం బీవీ నగర్ ఆర్టీవో ఆఫీస్ దగ్గర ఉన్న ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసనగా ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తక్కువ ధరలతో తయారుచేసి ఎక్కువ ధరలకు విక్రయించడం జరుగుతుందని తెలియజేశారు. ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేయడం కల్తీ మద్యం తయారుదారులు సాధ్యం కాదని ఇంతటి కార్యక్రమం వెనుక కూటమి ప్రభుత్వం అండదండ్రులు ఎంతైనా ఉన్నాయని తెలియజేశారు. ఈ కల్తీ మద్యంలో ఎవరెవరైతే ఉన్నారో వారందరినీ చట్టం ముందు దోషులుగా చేసి శిక్షించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఇన్చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి : ఎంఈఓ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పదవతరగతి పరీక్షలో నూరు శాతం ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గడ్డం వారిపల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుంటూ పాఠశాలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. తదుపరి ఎఫ్ఎ 2 పరీక్షలను పరిశీలిస్తూ సమయపాలన పాటిస్తూ పరీక్షలను పకడ్బందీగా జరపాలని ప్రధానోపాధ్యాయులు జి.మాలకొండయ్యకు తెలియజేశారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి పదో తరగతి విద్యార్థులు ఉన్నత మార్కులతో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టి చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలియజేశారు. ఈరోజు నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి వారి చేతుల మీదుగా స్కూలులోనే విద్యార్థులందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.మాలకొండయ్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రత్యేక అవగాహన




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 సంస్కరణలు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే అంశంపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం విశ్వవిద్యాలయ సీవీ రామన్ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ప్రధాన అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను పారదర్శకత వైపు నడిపిస్తాయి. వ్యాపార వాతావరణం సులభతరం అవుతుందని, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఫైనాన్స్ అవగాహన పెంపొందించుకోవాలి అని సూచించారు. వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ కిరణ్ మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 సంస్కరణలు వాణిజ్య రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తాయి. పన్ను చెల్లింపులు, రిఫండ్‌లు, అకౌంటింగ్ వ్యవస్థలో డిజిటలైజేషన్ ద్వారా పారదర్శకత, వేగవంతమైన సేవలు అందించడం లక్ష్యం. 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సూత్రం ద్వారా రాష్ట్ర ఆదాయంతోపాటు వ్యాపారులకు ప్రోత్సాహం కల్పించడమే ఉద్దేశ్యం అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. వాణిజ్య పన్నుల శాఖ, విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పన్ను విధానాలపై అవగాహన పెంచడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ కళాశాల నెల్లూరు ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ, వీఎస్‌యూ కళాశాల కావలి ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ సాయి శ్రవంతి, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సిహెచ్ గోపీచంద్, ఎస్‌కే గౌసేపీరా, జీవీ సునీల్, నిష్కుమార్, అనిల్ కుమార్, అలాగే విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు 'జీఎస్టీ పోర్టల్, న్యూ ఫైలింగ్ సిస్టమ్"పై ప్రదర్శన ఇచ్చి, కొత్త పన్ను రిటర్న్ విధానాలపై ప్రాక్టికల్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీఎస్టీ 2.0 సంస్కరణలు, డిజిటల్ ఫైలింగ్ వ్యవస్థ, వాణిజ్య రంగంలో జరుగుతున్న ఆధునిక మార్పులపై స్పష్టమైన అవగాహన పొందారు.




# పాలవల్లి పద్మనాభరెడ్డి నేత్రదానం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం వైకుంఠపురంకి చెంధిన పాలవల్లి పద్మనాభరెడ్డి (58) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వీరి నేత్రాలను మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో, జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి, కావలి రెడ్‌క్రాస్ సభ్యులు గోసల గోపాల్ రెడ్డి ప్రేరణతో భార్య పాలవల్లి మాధవి, కుమార్తెలు లిఖిత, తనుజ అంగీకారంతో పద్మనాభ రెడ్డి నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేసారు. పద్మనాభరెడ్డి కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. నేత్రదాత కుటుంబసభ్యులకు కావలి రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కృతజ్ఞతలు తెలిపారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 150వ రక్తదానమని రెడ్ క్రాస్ ప్రతినిధులు డి రవిప్రకాష్, కె.హరినారప రెడ్డి తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో చామదల రోడ్డు అభివృద్ధి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలతో గ్రామ టీడీపీ నేత మునగాల వెంకటేశ్వర్లు రెడ్డి, యువ నేత తిరుమలరెడ్డిల ఆధ్వర్యంలో చామదలలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో పట్టించుకొని రోడ్లను అభివృద్ధితో మహర్దశ పట్టిస్తున్నారు. రోడ్ల అభివృద్ధి పనులు చూసి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా చిన్నపాటి వర్షానికి రోడ్డుపై నీళ్లు నిలిచి బురదలో వెళ్లాల్సి వచ్చేదని, అభివృద్ధి పనులతో ఆ బాధ తప్పిందని ప్రజలు అంటున్నారు. ఈ కార్యక్రమంలో సన్నపురెడ్డి మాదేవ్‌రెడ్డి, భాస్కర్, పొంగా తిరపాతయ్య, అమరయ్య నాయకులు పాల్గొన్నారు.

# సీపీఆర్ ప్రాణ సంజీవని : డాక్టర్ కరుణాకర్




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాణాలను కాపాడే సీపీఆర్ పద్ధతి గురించి అవగాహనా కార్యక్రమాన్ని హెూమియో వైద్యులు కరుణాకర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది ప్రాణాలను రక్షించెడి సంజీవని, చాల మంది ప్రాణాలు ఈ పద్ధతి ద్వార కాపాడపడినట్లు ఆధారాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ పద్ధతి గురించి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరముందన్నారు. ఇది ముఖ్యంగా కార్డియాక్ అరెస్ట్ ఐన రోగులలో అనుసరించె విదానం. ఈ సూక్ష్మమైన విదానంను సరైన సమయంలో సరిగా చేస్తే ప్రాణాలను కాపాడవచ్చును ఇది ప్రథమ చికిత్సలో ఒక భాగం కనుక అందరు ట్రైనింగ్ తీసుకుని అవసరమైనపుడు వాడవల్సిందిగా పిలుపునిస్తు లైఫ్ సేవింగ్ పద్ధతిని అందరు అవగాహన కలిగి వినియోగిస్తామనెలా అందరి చేత ప్రతిజ్ఞ చేపించారు. డిస్పెన్సరికి వచ్చిన రోగులందరికి చేసి చూపించారు. అంతకంటె ముందుగా అయుర్వేద డాక్టర్ హేమంత్‌తో కలిసి కోవురులోని సిహెచ్‌సీలో సూపరిండెంట్ సమక్షములో ఈ పద్ధతిని చెసి చుపించి లోటుపాటులు తెలుసుకోని కరెక్ట్‌గా ఏలా చేయాలో ట్రైనింగ్ తీసుకోవడం జరిగింది. దీని గురించి ఇంకా ఈ వారమంతా రోజు వీలైనంతమందికి అవగాహనా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు డా కరుణాకర్ తెలిపారు.

# పౌష్టికాహారం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

## బిడ్డలను పూర్వప్రాథమిక విద్యకు సిద్ధం చేయాలి : సీపీడీఓ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహిళలందరూ పౌష్టికాహారంపట్ల తగిన అవగాహన పెంపూఒందించుకోవాలని, తమ బిడ్డలను అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యకు సమాయత్తం చేయాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పిలుపునిచ్చారు. సోమవారం పోషణ్‌మా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద సూపర్‌వైజర్ జి.కస్తూరి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సుకు సునీలత అతిధిగా హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆకర్షణీయంగా తీర్చిద్దిన కేంద్రాన్ని, వివిధ రకాల పోషకవిలువల ఆహారపధార్థాల ప్రదర్శనను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా 4 నుండి 6 సంవత్సరాలలోపు చిన్నారులను తప్పకుండా తమ సమీప అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్చి వారికి పూర్వప్రాథమిక విద్యను అందించాలని, వారు ఇక్కడ పూర్వప్రాథమిక విద్యపొంది ప్రాథమిక పాఠశాలల్లో విద్యపొందేందుకు సమాయత్తం చేయాలని ఆమె కోరారు. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని, దాంతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు రూపొందించిన అందుబాటులోని పోషకవిలువల ఆహారపధార్థాలను తయారు చేసుకొని భుజపించాలని ఆమె కోరారు. తగినంతగా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వాలు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రత్యేక తీసుకుంటున్నాయని, అవగాహన కల్పించేందుకు తాము అన్ని ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సునీలత పేర్కొన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం పట్ల అందరూ తగు శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం అందించే పాలు, కోడిగ్రుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్, రాగిపిండి, వేరుశనగ చిక్కీలు, బెల్లం, ఖర్జూరం, అటుకులను లబ్దిదారులే వినియోగిం చుకోవాలని ఆమె సూచించారు. విద్య, వైద్యం, ఆరోగ్యం పట్ల మహిళలు మరింతగా శ్రద్ధ తీసుకోవాలని, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తల సలహాలు, సూచనలు పాటించాలని సిడిపివో సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ కస్తూరి పౌష్టికాహార ఆవశ్యకత గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పెంచలమ్మ, మహాలక్ష్మి, శ్రీదేవి, రాజేశ్వరి, కామాక్షి, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు కోట్ల వ్యయంతో డ్రైనేజీ కాలువలు నిర్మాణ పనులు

## అధికారులతో చర్చించిన మండల టీడీపీ అధ్యక్షుడు నీలం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రెండు కోట్ల రూపాయలు సీఎస్ఆర్ నిధులతో ముత్తుకూరు గ్రామపంచాయతీలో డ్రైనేజీ కాలువలు నిర్మాణ పనులు చేపట్టే విధంగా తగిన ప్రణాళికలు అధికారులు సిద్ధం చేస్తున్నారని ఈ పనులకు తగిన నిధులను ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సమకూరుస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ అన్నారు. సోమవారం ఆదాని ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ తో కలిసి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణ పనులకు సంబంధించిన స్థలం సర్వే కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేడియం చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు కొలతలు వేయడం జరిగింది అన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో ఈ పనులు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోలిగర్ల శ్రీనివాస్ యాదవ్, పైనం పురం సర్పంచ్ కావలి విజయ్ కుమార్, టిడిపి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులు బాలింతలు చిన్నపిల్లల కోసమే రాష్ట్రీయ పోషణ మాసం మహెూత్సవాలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలో సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 16వ తేదీ వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసం మహెూత్సవాల కార్యక్రమంలో భాగంగా నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలోని సోమవారం అల్లిపురం నందు 6 అంగన్వాడి కేంద్రాల్లో 8వ రాష్ట్రీయ పోషణమాసం మహెూత్సవాలు ఐసీడీఎస్ సూపర్వైజర్ వి.శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వి.శకుంతల మాట్లాడుతూ.. గర్భవతులు, బాలింతలు చక్కెర,నూనె తగ్గించి ఆహారం తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రధానంగా చిరుధాన్యాలైనటువంటి రాగులు, జొన్నలు, సజ్జలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. చిన్నారులు ప్రాథమిక దశ నుండి చేతుల పరిశుభ్రంగా చేసుకునే విధంగా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని తెలియజేశారు. అదేవిధంగా చేతులు శుభ్రత పై ఐదు రకాలుగా ఏ విధంగా చేసుకోవాలో పిల్లలకు చేసి చూపించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు పెంచలమ్మ స్వాతికళ, నాగలక్ష్మి, వెంకటరత్నమ్మ, అనూష, అనురాధ, హెల్పర్లు పాల్గొన్నారు.

## మొగుళ్ళపల్లి సత్రం ఆస్తులను వినియోగంలోకి తేవాలి : మిడతల రమేష్



**నెల్లురు సిటీ, మేజర్‌న్యూస్ :** మొగళ్లపల్లి సత్రం ఆస్తులను ఆధునికరించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిపాలనాధికారి శ్రీలతకు బిజెపి నేత మిడతల రమేష్ వినత పత్రం ఇచ్చారు. నెల్లూరు నడిబొడ్డులో 100కోట్ల విలువచేసే సత్రం ఆస్తులు శిథిలావస్థకు చేరాయి. మొగళ్లపల్లి వెంకటసుబ్బయ్య శ్రేష్టి పేద ప్రజల సేవా కార్యక్రమాల కోసం ఇచ్చిన విలువైన ఆస్తులు నిరుపయోగంగా ఉండడం బాధ కలిగిస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవనాలు నిర్మించాలని రమేష్ విజ్ఞప్తి చేశారు. 100 కోట్లు విలువ చేసే ఆస్తులను ప్రజలకు ఉపయోగపడాలి. అలాగే ఈ నిర్మాణాల వలన దేవదాయ ధర్మదాయ శాఖకు ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని రమేష్ తన వింత పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, కంచర్ల నారాయణ యాదవ్, బుధవరపు బాలాజీ, కళ్ళు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కమీషనర్‌ను అభినందన సన్మానం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎల్ఆర్ పల్లి జెడ్పి హైస్కూల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మెన్, శ్రీరామానాగ్యమండలి అధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య ఘనంగా సన్మానించి అబినందించారు. ఆయన కమీషనర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంలతో సన్మానించి అభినందించి భవిషత్తులో మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఆత్మకూరు మున్సిపాలిటీని స్వచ్ఛతగా ఉంచేందుకు ప్రత్యేకదృష్టిసారించి ఉత్తమ అవార్డు పొందడం మున్సిపాలిటీకే గర్వకారణమని ఆయన పేర్కొంటూ కమీషనర్ సేవలను కొనియాడారు.

## నకిలీ మద్యంపై వైసీపీ నిరసన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని నిర్మూలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సోమవారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎదుట వైసీపీ నాయకులు ప్లకార్డులు చేతపట్టి నినాదాలతో కూడిన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభత్వం అధికారంలోకి వచ్చాక ఊరూరా మద్యం విక్రయాలు జోరందుకున్నాయన్నారు. నకిలీ మద్యం తాగి పలువురు మృత్యువాతపడడంతో వారు కుటుంబాలు వీధినపడ్డాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నకిలీ మద్యం విక్రయాలపై ఎవరూ ప్రమేయం ఉందో సీబీఐ దర్యాప్తు చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మండల వైసీపీ కన్వీనర్లు కొండా రాజాగోపాల్ రెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, శ్రీనివాసులు, కాటం రవీంద్రరెడ్డి, జిల్లా బీసీ నాయకులు వంశీ వైసీపీ నాయకులు కల్లూరి రమణారెడ్డి, దసగిరిఅహ్మద్, ఎంఎ సలీం, బాబు, గంగాధర్, రామయ్య, గురవయ్య, పెంచలయ్య, రాజా,వీరారెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని

## టపాసుల గోడౌన్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలి : సర్కిల్ సీఐ




**జలదంకి, మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని కలిగిరి సర్కిల్ సీఐ వెంకట నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలందరూ దీపావళి పండుగను ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. దీపావళి పండుగ సమయంలో బాణాసంచా కాల్చే సమయంలో చిన్నారుల వద్ద తప్పనిసరిగా తల్లిదండ్రులు ఉండి వారిచేత కల్పించాలని అన్నారు. బానా సంచా కాల్చే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండి సంతోషంగా పండుగ జరుపుకోవాలని వివరించారు. అలాగే టపాసుల గోడౌన్ల నిర్వాహకులు తప్పనిసరిగా అన్ని అనుమతులు తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేని బాణాసంచా గోడౌన్లపై తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికల శిశు సంరక్షణ చట్టం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో కృష్ణపట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థినిలు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. ఈ విషయాన్ని స్కూల్ హెడ్మాస్టర్ సరళ సోమవారం తెలిపారు. వ్యాసరచనలో కరణం మహేశ్వరి, పెయింటింగ్ విభాగంలో కాపులూరు కుసుమ తమ ప్రతిభను చాటి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఒక్కొక్కరు 5వేల రూపాయలు నగదు బహుమతిని అందుకున్నట్లు హెడ్మాస్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన ఆ బాలికలను ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు అభినందించినారు.

## ఇసుక అక్రమరవాణాను అరికట్టాలి


### ప్రమాదనిందితులపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో ఇసుక అక్రమరవాణాను అరికట్టాలని, అనుమతులు లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని, అనుమతులున్నా తగిన మోతాదులోనే ఇసుకను తరలించేలా చూడాలని, ఇసు వాహనాలు మితిమీరిన వేగంగా వెళ్లకుండా పర్యవేక్షించాలని ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు కోరారు. ఈమేరకు సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్తానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై పెరమన రోడ్డు వద్ద కారును ఇసుకట్రిప్పర్ ఢీ కొనడంతో 7మంది మృతిచెందిన విషయం విధితమే కాగా ఈ ప్రమాదానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కేసులో నిందితుడుగా నమోదైన నిందితులను ఇంకా అరెస్ట్ చేయకపోవడం విచారకరమన్నారు. హైవే ప్రక్కన మద్యం దుకాణాలను తొలగించాలని ఆయన కోరారు. జాతీయరహదారిని నాలుగులైన్ల రహదారిగా నిర్మించి డివైడర్లు ఏర్పాటు చేయాలని, అధికలోడుతో ఇసుకను తరలించే వాహనాలను



సీజ్‌చేయాలని, ఆవాహనాల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెరమనరోడ్డు వద్ద ప్రమాదంలో మృతిచెందిన 7మంది దళితుల కుటుంబాలకు 25లక్షల రూపాయలవంతున పరిహారం అందజేయాలని, ఈప్రమాదంలో నింది తులను వెంటనే అరెస్ట్ చేయాలని, ఆత్మకూరు పట్టణంలో మద్యం దుకాణాలు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏ.నాగయ్య, రవీంరద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భూమియజమానిని భయాందోళనకు గురిచేస్తున్న వ్యక్తి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భూమికి తగిన పత్రాలుండగా ఆ భూమిని సాగుచేసుకొని జీవనం సాగిస్తున్న యజమానిని ఓ వ్యక్తి భయాందోళనకు గురిచేస్తున్నాడని, ఆభూమిని కాజేయాలన్న యోచనలో ఉన్నాడని, ఈవిషయమై ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా దిగువస్థాయి సిబ్బంది ఖాతరు చేయడం లేదని అనంతసాగరం మండలం మినగల్లు పంచాయతీ వెంకటరెడ్డిపల్లికి చెందిన బొజ్జా నాగమ్మ వాపోతున్నారు. ఈమేరకు సోమవారం ఆమె స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల తాను తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగుకు వెళ్ళగా మొద్దు చినపెంచలయ్య అనే వ్యక్తి అడ్డుకుంటూ భయాందోళనకు గురిచేస్తున్నాడని ఆమె పేర్కొంది. ఈపొలంకు సంబంధించి ఏదేని ఆధారాలున్నాయా అని అడిగితే అలాంటివేమీలేవని, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బెదిరిస్తున్నాడని ఆమె పేర్కొంది. పెంచలయ్య విఆర్వో అండచూసుకొని తన పొలాన్ని ఆక్రమించుకోవాలన్న దురుద్దేశ్యంతో ఈవిధంగా తనను భయపెడుతున్నాడని, దౌర్జ్యన్యానికి దిగుతున్నాడని ఆమె ఆర్డీవోకు వివరించింది. ఈపొలం నాగమ్మ పేరుతోనే రికార్డుల్లో ఉందని, ఎవరికి సంబంధం లేదని, పూర్తిహక్కు నాగమ్మకే ఉందని, రికార్డు పరంగా తగు పత్రాలు అందించి పోలీస్‌సహకారంకు కూడా లేఖ ఇస్తామని ఆర్డీవో ఆమెకు భరోసా ఇచ్చారు. తనను తరచూ బెదిరిస్తున్నాడని, దాడి చేసే యత్నంలో పెంచలయ్య ఉన్నాడని ఆమె ఆర్డీవోకు వివరించగా తగిన రక్షణ కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## కార్మికశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ అవగాహనా ర్యాలీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జిఎస్‌టి తగ్గింపు, దాంతో సరుకుల, వస్తువుల ధరలు తగ్గుదల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం స్థానిక సహాయకార్మికశాఖాధికారి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మోటర్‌బైక్‌ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్ ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండు నుండి మున్సిపల్ బస్టాండువరకు, అక్కడనుండి మళ్ళీ ఆర్టిసి డిపోవరకు ఈర్యాలీని కొనసాగించారు. ఈసందర్భంగా కమీషనర్ గంగాప్రసాద్, అసిస్టెంట్‌లేబర్ ఆఫీసర్ రమేష్‌నాయుడులు ప్రసంగించారు. కేంద్రప్రభుత్వం జిఎస్‌టిని బాగా తగ్గించిందని, దాంతో అనేకరకాల వస్తువులు, సరుకులు, పరికరాలపై, తినుబండారాలపై ధరలు బాగా తగ్గాయని పేర్కొన్నారు. ప్రజలు ఈవిషయమై తగిన అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. జిఎస్‌టి తగ్గింపువలనలబించెడి ఆదాయాలు గురించి వివరించారు. నూతన జిఎస్‌టి విధానం గురించి వివరించే వాల్‌పోస్టర్లను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో పలువాహనషోరూమ్‌ల మెకానిక్‌లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, పురుగుమందుల దుకాణాల తనిఖీలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణం, మండలంలో సోమవారం వ్యవసాధికారులు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. స్థానిక వ్యవసాయసహాయసంచాలకులు వి.దేవసేనమ్మ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలు, రికార్డులను ఆమె నిశితంగా పరిశీలించారు. సరైన రికార్డులు, పత్రాలు లేని 34,400 రూపాయల పురుగుల మందులను సీజ్‌చేసి అమ్మకాలను నిలిపివేశారు. ప్రతి ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాదారులు తప్పనిసరిగా బిల్లులు, రిజిస్టర్‌లు తదితర రికార్డులను ఖచ్చితంగా నిర్వహించాలని, ఏమాత్రం తేడాలున్నా తాము ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎంఆర్‌పి ధరలకన్నా అధికంగా విక్రయిస్తే లైసెన్సులు రద్దుచేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## సమిష్టికృషితోనే ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు







**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రోత్సాహం, సూచనలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తమ సిబ్బంది, ప్రధానంగా పారిశుధ్య కార్మికులు తదితరులందరి సమిష్టి సహకారం, కృషితోనే ఆత్మకూరుకు ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు లభించిందని స్థానిక మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో ఆరు మున్సిపాలిటీలు ఉత్తమ స్వచ్ఛ అవార్డులకు ఎంపికకాగా అందులో ఆత్మకూరు ఉండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కమీషనర్ సి.గంగాప్రసాద్‌లు అవార్డును అందుకొని సన్మానాలు పొందిన విషయం విధితమే. సోమవారం మున్సిపల్ కౌన్సిలర్, పట్టణ తెలుగుమహిళ అధ్యక్షురాలు కొప్పోలు రమాదేవి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభినందనసభ ఏర్పాటు చేశారు. రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈసభలో కమీషనర్ గంగాప్రసాద్‌చేత కేక్‌కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. అనంతరం రమాదేవి, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, మహబూబ్‌బాషా, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి,మాజీ కౌన్సిలర్ దోర్నాదుల సురేష్‌బాబు, తెలుగుదేశం జిల్లా నాయకుడు చంద్రా వెంకటసుబ్బానాయుడు, బిజెపి సీనియర్ నాయకుడు, ఏఎంసి మాజీ చైర్మెన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్, మెప్మా సిఎంఎం హర్షిత, మెప్మా ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి మహిళలు, క్రెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాగాల శ్రీహరి తదితరులు కమీషనర్ గంగాప్రసాద్‌ను శాలువాలు, పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా అతిధులు తమ ప్రసంగంలో కమీషనర్ సేవానిరతిని, విధులపట్ల అంకితభావాన్ని, పారిశుధ్యంపట్ల తీసుకున్న జాగ్రత్తలను వివరించి అవార్డు సాధించి ఆత్మకూరు మున్సిపాలిటీకే గౌరవం తెచ్చారని కొనియాడారు. అభివృద్ధిని పరుగులు తీయిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభివృద్ధితోపాటు సంక్షేమం, ప్రజలకు కనీససౌకర్యాలు, వసతులు తదితరాలపై కూడా నిరంతం దృష్టి సారించి ఉంటారని, ఆయన ప్రోత్సాహంతోనే ఆత్మకూరు మున్సిపాలిటీకి అవార్డు లభించిందని వారంతా పేర్కొన్నారు. ఈసందర్భంగా సన్మానగ్రహీత, కమీషనర్ గంగాప్రసాద్ ప్రసంగిస్తూ తనను సన్మానించి అభినందించినవారందరికీ పేరుపేరునా ధన్యవాదాలని పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రోత్సాహం, ఆయన చూపుతున్న శ్రద్ధ, ఇచ్చే సలహాలు, సూచనలతో ఉత్తమ అవార్డు లమించిందన్నారు. దాంతోపాటు మున్సిపల్ పాలకవర్గ ప్రతినిధులు, నాయకులు, ప్రజలందరి సమిష్టి సహకారం, ఎంతో శ్రమకోర్చి విధులు నిర్వహించి పారిశుద్యాన్ని మెరుగ్గా ఉంచుతున్న పారిశుధ్యకార్మికుల సమిష్టి కృషితో ఆత్మకూరు మున్సిపాలిటీ ఉత్తమ స్వచ్ఛ అవార్డుకు ఎంపికైందని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలని గంగాప్రసాద్ పేర్కొన్నారు. కాగా ఈ అవార్డు తమ బాధ్యతలను మరింతగా పెంచిందని, ఈ అవార్డు స్ఫూర్తితో మరింత దృష్టి సారించి పారిశుధ్యం స్వచ్ఛతగా ఉండేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఇదేమాదిరిగా సహకరించాలని, చెత్తను మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని, ఎక్కడబడితే అక్కడ వేయరాదని ఆయన కోరారు. అందరూ వ్యక్తిగత,పరిసరాలపరిశుభ్రత పాటించాలని, పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని గంగాప్రసాద్ కోరారు. ఈకార్యక్రమంలో అతిధులు, వందలాదిమంది మెప్మా మహిళలు, కార్యాలయ సిబ్బంది, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు కమీషనర్‌ను అభినందనలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకుడు కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ కార్యాలయ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థల యజమానులకు నోటీసులు ఇవ్వండి : కమిషనర్



నెల్లూరు మేజర్‌న్యూస్, కార్పొరేషన్ : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 28, 29 డివిజన్ల జీఎస్టీ రోడ్డు ఎస్‌బీఐ బ్యాంక్, సాయి బాబా టెంపుల్ ప్రాంతంలో సోమవారం పర్యటించారు. వర్షపు నీరు రోడ్లపై నిలబడకుండా డ్రైను కాలువల ద్వారా సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డ్రైను కాలువలలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని, డ్రైను కాలువలలోని సిల్ట్‌ను ఎప్పటికప్పుడు రోడ్లపై నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో భాగంగా స్థానికంగా నిర్మిస్తున్న నూతన డ్రైను కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. డివిజన్ల పరిధిలో నూతన భవనాలకు అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి, దుకాణాలకు, ఇతర ఆస్తులకు తప్పనిసరిగా అసెస్మెంట్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలం పన్నులను చెల్లించే విధంగా సంబంధిత స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో నకిలీ మద్యంపై వైసీపీ నిరసన



వెంకటాచలం, మేజర్‌న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలం మండల కేంద్రంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొని నకిలీ మద్యం వ్యాపారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ర్యాలీ సందర్భంగా నకిలీ మద్యం నిర్మూలన ప్రజల రక్షణ అనే నినాదాలతో మండల కేంద్రం మార్మోగింది. నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపులను కూటమి ప్రభుత్వం నియంత్రించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం మద్యం పాలసీని తెచ్చిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నాయకులే నకిలీ మద్యం తయారీ, విక్రయంలో సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతుండగా, ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం జరుగుతోందని తెలిపారు. నకిలీ మద్యం కుంభకోణంపై ప్రభుత్వం పారదర్శక విచారణ చేపట్టాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. గ్రామాల్లో బెల్టు షాపులను పూర్తిగా తొలగించి, నకిలీ మద్యం విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ మద్యం నిర్మూలన కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, కాకాణి గోవర్ధన్ రెడ్డి నాయకత్వంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు నాయకులు ప్రకటించారు.

# రోజా.. నీ నాలుక కోస్తా

- కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతల విమర్శలు
- ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదంటూ మండిపాటు
- డైవర్షన్ పాలిటిక్స్ చేసేందుకే కల్తీ మద్యం వ్యవహారం
- కల్తీ మద్యం వ్యవహారానికి బాధ్యత వహించాల్సింది వైసిపి ప్రభుత్వమే
- నెల్లూరు నగర టీడీపీ మహిళ అధ్యక్షురాలు కప్పిర రేవతి



నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ చేసేందుకు కల్తీ మద్యం వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారంటూ, అసలు కల్తీ మద్యం వ్యవహారం తెరపైకి వచ్చింది గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే కాదా అంటూ నెల్లూరు నగర టిడిపి మహిళ అధ్యక్షురాలు కప్పిర రేవతి ధ్వజమెత్తారు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేసి వైసీపీ నేత, మాజీ మంత్రి రోజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాట మీద నిలకడ లేకపోవడం వల్లే రోజాను 'తైతక్కల రోజా' అని పిలవాల్సి వస్తోందంటూ ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. మొలకలచెరువులో ఇటీవల వెలుగుచూసిన కల్తీ మద్యం వ్యవహారానికి గత వైసీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. 'పీనుగ పోయినా.. ఆ పీనుగ చేసిన పాపం ఇంకా అక్కడ అక్కడ కన్పిస్తూనే ఉంది తైతక్కల రోజా' అంటూ వ్యంగ్యాస్త్రాలు చేశారు. మీ హయాంలో నాసిరకం మద్యంతో ప్రజల రక్తాన్ని స్ట్రా వేసి మరీ పీల్చేశారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలంటే వ్యాఖ్యానించారు. మీ పాపాల్ని తుడిచే ప్రయత్నంలోనే మొలకల చెరువులో కల్తీ సారా వ్యవహారం వెలుగులోకి వచ్చిందనే విషయం తెలుసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక వైసీపీ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తుందని మండి పడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో ఈ కల్తీ సారా పాపం పురుడు పోసుకుందన్నారు. దాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయట పెట్టిందన్నారు. మొలకల చెరువు కల్తీ సారా అంశాన్ని బయట పెట్టింది కూటమి ప్రభుత్వం కాదా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వంలోని ఎక్సైజ్ అధికారులు, మేము ప్రక్షాళన చేస్తుంటే.. ఆ పాపాన్ని ప్రభుత్వంపై నెడతున్నారంటూ ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు నుంచి గులక రాయి వరకు మీ డ్రామాలు చూశామన్నారు. తప్పు మీరు చేయడం.. నెపాన్ని మా మీద నెట్టడం మీకు అలవాటేగా అని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నువ్వు ఎన్ని చేసావో ప్రజలందరికీ తెలుసు అన్నారు. టిడిపి జోలికి వస్తే మీ అంతు చూస్తామని.. టీడీపీ ప్రభుత్వం గాని, మమ్మల్ని గాని గోహేట్ అంటే నీ నాలుక మీద వాత పెడతామన్నారు. మీ వైసీపీ ప్రభుత్వంపై రాజశేఖర్ రెడ్డి ఆత్మఘోషిస్తుందని సిగ్గు లేకుండా ఆరోపణ చేయడం సరికాదు అన్నారు. టిడిపి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని, మరోసారి ముఖ్యమంత్రిని ఎవరైనా మాట్లాడితే నీ నాలుక కోస్తామని కప్పిర రేవతి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శ్రీలక్ష్మి, మంజుల, తులసి, అనుష, లత, సునీత, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడిని కాపాడిన కిమ్స్ వైద్యులు




నెల్లూరు, మేజర్‌న్యూస్ : తిరుపతి జిల్లా పాములు మెట్ట గ్రామానికి చెందిన అభిషేక్ 13 సంవత్సరాల బాబుని తేలు కొట్టడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బాలునికి స్థానిక కిమ్స్ వైద్యులు చికిత్స అందించి కాపాడారు. మొదట సులూరుపేటలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్చిన తర్వాత డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉందని తెలియజేయడంతో వెంటనే నెల్లూరులోని కిమ్స్ హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. ఈ సమయంలో బాబుకి తీవ్రమైన నొప్పితో ఆయాసంతో బాధపడుతున్నాడు. వెంటనే ఎమర్జెన్సీలో ఉన్న కార్డియాలజిస్ట్ పరీక్షలు చేసి బాబుకు వెంటనే మెరుగైన సేవలు అందించి ప్రాణాయ పరిస్థితిలో ఉన్న బాబుని క్షేమంగా కాపాడారు. ఈ చికిత్సలో పాల్గొని పేషెంట్ ప్రాణాలను కాపాడిన వైద్య బృందానికి, ఇతర సిబ్బందికి కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి నాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సతీష్ కుమార్, మెడికల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

# స్వదేశీ వాడకంతోనే.. ఆర్థికంగా దేశాభివృద్ధి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు



నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ : స్వదేశీ వాడకంతోనే ఆర్థికంగా దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు తెలిపారు. సోమవారం స్థానిక కొత్తూరులో నాలుగు డివిజన్ల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్‌లోని 30, 31, 32, 33 డివిజన్‌లకు సంబంధించిన కార్యకర్తలతో ముఖాముఖి సమావేశం అయ్యారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా ఇచ్చిన పిలుపుమేరకు నెల్లూరు జిల్లా బీజేపీ శాఖ అన్ని మండలాల్లో, అన్ని డివిజన్లో ఆత్మనిర్భర్ పేరిట కార్యకర్తలను చైతన్యవంతులు చేసి దానిద్వారా ప్రజల వద్దకు స్వదేశీ వస్తువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు ముందస్తు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2047వ ఏడాది నాటికీ స్వదేశీ వస్తువుల వాడకం ద్వారా భారత్ ప్రపంచంలో ఆర్థికంగా మొదటి స్థానానికి చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దేశవ్యాప్త పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింట స్వదేశీ అంటూ ప్రతి ఇంటికి బీజేపీ కార్యకర్తలు వెళ్లి స్వదేశీ వస్తువులు వాడకంపై అవగాహనా కల్పిస్తారని ఈ విషయంలో కార్యకర్తలు చురుగ్గా ముందుకు పోవాలని కోరారు. కార్యక్రమంలో కొత్తూరు మండలం అధ్యక్షులు తోట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆరని మణి, వేణు గోపాల్, జనార్దన్, తిరుపాలు, దాసు, పెంచల రత్నం, కోటయ్య, నాగేశ్వర రావు, హరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు



వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరు నడుమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి అంకాలమ్మ, నాగవరపు అమ్మ వార్లకు సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. గురవారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయాన్నే స్వామివారికి అమ్మవార్లకు అభిషేకములు జరిపించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో జరిపించారు ఉదయాన్నే మహిళా భక్తులు ఆలయానికి చేరి స్వామివారికి కాయ కర్పూరం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు తీర్థ ప్రసాదాలు స్వీకరించి పునీతులయ్యారు.